
# నాలాంటి ఒకరు




**డా**బామీద ఆమె నా ఎదురుగానే పడుకున్నది. ఆమె పక్కనే మరో ఇద్దరు వయసుమళ్ళిన ఆడవాళ్ళు పడుకుని నిద్రపోతున్నారు.

ఆమె- అంటే రాజేశ్వరి నిద్రపోవటంలేదని నాకు తెలుసు. ఆమె తప్పక నా గురించి, నన్ను కలుసుకుని మాట్లాడే అవకాశం గురించి ఆలోచిస్తూ ఉంటుందని నా ప్రగాఢ నమ్మకం.

ఎందుకంటే ప్రస్తుతం నేనుకూడా సరిగ్గా అదే పరిస్థితిలో ఉన్నాను.

చుట్టూ ట్యూబులైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. కొంతమంది పిల్లలు రాత్రి

పదకొండు గంటలు దాటుతున్నా నిద్ర పోకుండా డాబామీద ఓ చివరగా కూర్చుని మాంత్రికుల కథలు చెప్పుకుంటున్నారు.

వాళ్ళ మాటలు నాకు వినబడుతూనే ఉన్నాయి. పడుకున్నాననే కాని నిద్ర రావటం లేదు. నా మనస్సులో సుడులు తిరుగుతున్న రాజేశ్వరితో ఎలాగైనా మాట్లాడాలనే కోరిక నిద్రను దూరంగా తరిమివేస్తున్నది.

ఆశ్చర్యం!

అయిదేళ్ళ తర్వాత రాజేశ్వరి, నేను ఆ పెళ్ళిలో కలుసుకున్నాము.

రాజేశ్వరి ఆ రోజు సాయంత్రం భర్తతో కలిసి రిక్షాలోనించి దిగుతున్నప్పుడు ఆమెను చూడగానే నా గుండె ఒక్క క్షణం కొట్టుకోవటం ఆగిపోయింది.

ఆమెకూడా నన్ను చూడగానే ఆశ్చర్యపడి కళ్ళు రెపరెపలాడించి, ఆ తర్వాత నేనెవరో తెలియని దానిలా భర్తతో లోపలకు వెళ్ళిపోయింది.

పెళ్ళికొడుకు నాకు దూరపు బంధువు అవుతాడు. బహుశా రాజేశ్వరి భర్తకూడా పెళ్లికొడుక్కి బంధువో, స్నేహితుడో అయి ఉంటాడు.

ఆమెను చూసిన క్షణంలోనే నిర్ణయించుకున్నాను, ఎలాగయినా ఆమెతో మాట్లాడాలని. కాని రాజేశ్వరి అప్పటివరకూ నాకు ఆ అవకాశం ఇవ్వకుండా తప్పుకుని తిరిగింది. ఆమె ప్రవర్తనను బట్టి మా ఇద్దరికీ ఇంతకుముందే పరిచయమున్న విషయాన్ని అక్కడ ఎవ్వరికీ తెలియనివ్వడం ఆమెకు ఇష్టంలేదని గ్రహించాను.

నిజమే- ముఖ్యంగా ఆమె భర్త అనుమానం మనిషి కావచ్చు. అలాంటప్పుడు మేమిద్దరం మాట్లాడుకోవడం ఆయన చూడటం జరిగితే అందువల్ల ఆమె ఎన్నో చిక్కులను ఎదుర్కోవలసి రావచ్చు. అందుకే నేనుకూడా ఆమె ఎవరో తెలియనట్లే ఉండిపోయాను.

పక్కమీద అసహనంగా కదిలాను. చిన్నగా నిట్టూర్చాను- రాజేశ్వరికి వినపడాలనే.

నా ఊహ నిజమయింది.

రాజేశ్వరి ఒకసారి నావైపు తిరిగి నా కళ్ళలోకి సూటిగా చూసింది. ఆ చూపులో ఆమెకు నాపట్ల ఉన్న ప్రేమ, ఆరాధన నాకు తిరిగి కనిపించాయి.

తర్వాత మళ్ళీ అవతలివైపుకు తిరిగి పడుకున్నది.

నా హృదయంలో వో విధమైన అలజడి చెలరేగింది.

రాజేశ్వరికి ఇప్పటివరకూ పెళ్ళి అవకుండా ఉంటే బాగుండేదనిపించింది.

నవ్వుకున్నాను!

ఆ రోజు- అయిదేళ్ళ క్రితం- ఆ రోజున రాజేశ్వరి నన్ను కలుసుకుని తనకో సంబంధం వచ్చిందనీ, ఇంట్లో వాళ్ళు తనని బలవంత పెడతున్నారనీ చెప్పినపుడు పిరికివాడిలా ప్రవర్తించాను.

నిజమే. అప్పటి నా పరిస్థితి అలా ఉన్నది. చదువు పూర్తయింది కాని, ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. ఎప్పటికి ఉద్యోగం దొరుకుతుందో తెలీదు. ఎన్నేళ్ళని నాకోసం రాజేశ్వరిని పెళ్ళిచేసుకోకుండా వేచి ఉండమని చెప్పగలను?

అందుకే నన్ను, నా ప్రేమను మరచిపోయి మరో మనిషిని పెళ్ళి చేసుకొమ్మని నిర్దయగా, సూటిగా చెప్పేశాను.

అంతే-రాజేశ్వరి చాలా సేపటివరకూ నా ఎదురుగా ఏడుస్తూనే కూర్చున్నది. అయినా నా మనసు కరిగినా నా నిర్ణయాన్ని మార్చుకోలేక పోయాను.

నా మనసులో ఉన్న కోరికను గురించి ఇంట్లో చెప్పలేని పిరికితనం, ఒకరిమీద ఆధారపడిన పరిస్థితులు.

రాజేశ్వరి నన్నెంత గాఢంగా ప్రేమించిందో నాకు తెలుసు. నేను ఆమె నెంతగా ప్రేమించానో రాజేశ్వరికీ తెలుసు.

అందుకే విడిపోవాలని, ఇక ఎవరి జీవితం వాళ్ళదని అనుకున్నప్పుడు గుండెను ఎవరో బలవంతాన పిండినట్టుగానే అనిపించింది.

ఆ తర్వాత మూడేళ్ళకు నాకు వో బాంకులో ఉద్యోగం వచ్చింది. అయినా ఇంతవరకూ పెళ్ళిచేసుకోలేదు.

మళ్ళీ ఇన్నేళ్ళ తర్వాత రాజేశ్వరిని అనుకోకుండా ఈ పెళ్ళిలో కలుసుకోవడం...

అందుకే నా మనసు ఇలా ఆమెతో మాట్లాడాలని తహతహలాడుతున్నది.

ముహూర్తం ఒంటిగంట దాటిన పది నిముషాలకు. అందుకే పెళ్ళికి వచ్చిన చాలామంది బంధువులు సెకండ్‌షో సినిమాలు చూడటానికి వెళ్ళిపోయారు.

రాజేశ్వరి భర్తకూడా తొమ్మిదిన్నర దాటిన తర్వాత ఒక్కడే బయటకు వెళ్ళటం నేను చూశాను.

ఆమె భర్త సినిమానుంచి తిరిగిరాక ముందే రాజేశ్వరిని నేను ఎక్కడయినా కలుసుకుని మాట్లాడితే బాగుంటుందనుకున్నాను.

కాని ఎలా?

పిల్లలు కిందికి వెళ్ళిపోయి పడుకున్నారు. ట్యూబ్ లైట్లలో కొన్ని లైట్లు ఎందువల్లనో ఆరిపోయాయి.

డాబామీద కొంచెం చీకటి ఆక్రమించుకున్నది.

పన్నెండు గంటలు కావస్తున్నది. నాలో ఆత్రత పెరిగిపోయింది.

లేచి కూర్చున్నాను. చిన్నగా దగ్గాను. వెంటనే రాజేశ్వరి తలెత్తి నన్ను చూసింది. ఆమెనుకిందికి రమ్మన్నట్టుగా సైగచేశాను.

ఆమె క్షణం సేపు ఏదో ఆలోచించి తర్వాత లేచి నిల్చుని మెట్లవైపు నడిచింది. నేను

కూడా నిల్చుని ఆమె ఎటు వెళుతున్నదీ చూస్తున్నాను.

ఇంటి వెనుకవైపు గుబురుగా ఉన్న నారింజ చెట్లవైపు వెళ్ళింది. అక్కడ దీపాల వెలుతురు పడని ప్రదేశంలో నిలుచుండిపోయింది. రెండు నిముషాల తర్వాత ఎవ్వరూ చూడకుండా నేను ఆమె దగ్గరకు వెళ్ళాను.

"రాజేశ్వరీ" అన్నాను చిన్నగా.

"ఊ" అన్నది చెట్టుచాటుకు జరిగి.

"చాలా చిత్రంగా కలుసుకున్నాము కదూ!"

"అవును. బాగున్నావా?"

"ఆ... నువ్వెలా ఉన్నావు?"

"నిన్నే తలుచుకుంటూ బతుకుతున్నాను. నిజంగా నువ్వు నాకెంతో అన్యాయం చేశావు"

"నిజమే రాజేశ్వరీ. అప్పట్లో నేను పిరికివాడిగానే ప్రవర్తించాను. నేనెంత ఘోరమైన తప్పుచేశానో నీ పెళ్ళయిన తర్వాతనే నాకు తెలిసింది. నిన్నెంత మూర్ఖంగా పోగొట్టుకున్నానో తెలిసి ఈ క్షణానికీ ఎంతో కుమిలి పోతున్నాను. ప్లీజ్, నన్నర్థం చేసుకో"

రాజేశ్వరి వెంటనే మాట్లాడలేదు. ఆమె నాకు చాలా దగ్గరలో నిలుచున్నది. ఆమె భారంగా నిట్టూర్చటం నాకు తెలుస్తూనే ఉన్నది.

ఒక్కసారి ఆమెను దగ్గరగా తీసుకుని ఓదార్చాలనిపించింది. కాని ఇప్పుడామె ఒకప్పటి నా రాజేశ్వరి కాదు. మరో మనిషి భార్య.

అందుకు ఆమె ఒప్పుకుంటుందా?

కాని నేను ఊహించని విధంగా ఆమె నామీద వాలిపోయి చిన్నగా ఏడ్చింది.

నిజంగా షాక్!

"ప్లీజ్... ఏడవకు, రాజేశ్వరీ, ఈ జన్మకు మనకు ప్రాప్తం లేదు. కనీసం మరో జన్మలోనైనా మనిద్దరం కలిసి బతకాలని కోరుకుందాం" అన్నాను ఆమె తల నిమురుతూ.

క్షణం తర్వాత ఆమె తేరుకుని నా నించి దూరంగా జరిగింది.

"నా గురించి ఆలోచిస్తూ నువ్వు ఇలాగే జీవితాంతం ఒంటరివాడిగా ఉండిపోవద్దు. పెళ్లిచేసుకో. కాలం అన్ని గాయాలనూ మాన్పగలదు. ఇక వెళ్ళిపోదాం. ఆయన నన్ను బాగానే చూసుకుంటున్నారు. పిల్లలు పుట్టలేదనే దిగులు తప్పించి నాకు మరో లోటు ఏదీ లేదు. కాకపోతే ఆయన కొంచెం అనుమానం మనిషి. అందుకే మనిద్దరం ఒకరి కొకరు తెలుసన్నట్టు ఇక్కడ ఎవ్వరిముందూ ప్రవర్తించవద్దు. ఇక మనం వెళ్ళిపోదాం. ఆయన సినిమానుంచి వచ్చే టైమయింది" అన్నది.

"నిజమే. నువ్వు వచ్చిన దారినే వెళ్ళకు. ఇటువైపు నించి బాత్‌రూమ్ పక్కగా వెళ్ళు" అన్నాను.

సరేనని అవతలివైపునుంచి వెళ్ళిపోయింది రాజేశ్వరి.

నేను అక్కడే నిల్చుని ఉన్నాను. అంతా చీకటిగా ఉన్నది. ఇప్పుడు నా గుండెలోని భారం అంతా తీరిపోయినట్లు తేలిగ్గా అనిపించింది. ఒక నిముషం తర్వాత అక్కడినించి కదిలాను. నాలుగడుగులు వేసి ఠక్కున అక్కడే నిలుచుండిపోయాను. ఎవరివో మాటలు వినిపించి.

"నేను మీ అన్నయ్య పెళ్ళికోసం రాలేదు. రమా నిన్ను చూడాలని, ఎలాగైనా కలుసుకుని మాట్లాడాలని వచ్చాను"

"హు... ఇంక నువ్వు మాట్లాడేది ఏముంది? నాలో ఆశలు రేపి, చివరకు నాకు అన్యాయం చేసి మరో ఆడదాని మెళ్ళో తాళి కట్టావు కదా"

"నన్ను క్షమించు రమా. అప్పటి నా పరిస్థితి అలాంటిది. మానాన్న మాటకు ఎదురు చెప్పలేక మరొకరిని పెళ్ళి చేసుకున్నాను. ఏమయితేనేం? నిన్ను మీ ఆయన బాగానే చూసుకుంటున్నాడు కదా! నువ్వు సుఖంగా ఉండటమే నేను కోరుకునేది."

నిమిషం సేపు నిశ్శబ్దం.

"ఇక వెళదాం, రమా. నా భార్యకు కొంచెం అనుమానం. ఈ స్థితిలో మనల్ని చూసిందంటే నా పని ఖాళీ"

నిజంగా ఆశ్చర్యం కలిగింది.

కొంచెం ముందుకు వంగి కొమ్మల మధ్యగా దూరంనించి పడుతున్న లైటు వెలుతురులో ఆ మనిషిని చూసి మరింత ఆశ్చర్యపోయాను.

అతను- రాజేశ్వరి భర్త.

ఆ అమ్మాయి- పెళ్ళికొడుకు చెల్లెలు.

వాళ్ళుకూడా సరిగ్గా మేము ఉన్న పరిస్థితుల్లోనే ఉన్నారు.

దేవుడు ఎంత దయలేనివాడు! ఒకరు కోరుకున్న మనుషులను మరొకరికి కలుపుతాడు!

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయిన తర్వాత అక్కడినించి డాబామీదకు వచ్చేసరికి రాజేశ్వరి భర్త ఆమెకు సినిమా కబుర్లు చెబుతున్నాడు. ఏమీ తెలియనివాడిలా. రాజేశ్వరి కూడా ఏమీ తెలియని దానిలా ఆ కబుర్లు వింటోంది.

నాకేమీ పట్టనట్లు నేను మళ్ళీ పక్కమీద పడుకున్నాను. అవతలి వైపుకు తిరిగి.

(30 -5-1984 ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురితం)